# గాలి

"ఈ సారన్నా వచ్చాదో రాదో"

"వచ్చాదిలే"

"ఏమొచ్చాది... నెత్తికి గుండా... మనకొద్దే... ఈ ఓట్లు అంటి. అబ్బుడు ఇనపరాలా నీకు. మా నారిగోడు చెప్తాండాడు, రోడ్ల పనులొచ్చాయి, లచ్చులకు లచ్చులు మిగల్తాదంట అంటివి. కడాకు ఏమాయ... గోచిపాతగూడా మిగల్లా. ముప్పైవేలు అప్పు మిగిలె. అప్పులోల్లంతా యింటిమిందికొచ్చాండారు. ఎట్ల తీరచ్చావే అప్పు" కోపంగా భార్యమీద రంకెలు వేశాడు సుబ్బయ్య.

సుబ్బయ్య ఐదున్నరడుగుల పొడవుంటాడు. వయసు అరవై పైబడింది.

బాల్యంనుంచీ రెక్కల కష్టంతో బతుకుతుండడంతో వయసు మరింత ఎక్కువగా కనిపిస్తోంది. నల్లని శరీరం, నెరిసిన వెంట్రుకలు, ముతక రంగులో వున్న తెల్లబట్టలు. చెవిలో వున్న తుంటబీడిని తీసి వెలిగించాడు. రెండు దమ్ములు లాగాడు. తన మాటలు ఎవరైనా విన్నారేమోనని యిటూ అటూ చూశాడు. అది రాయచోటి బస్టాండు. జనం గుంపులు గుంపులుగా వున్నారు. కూర్చోను బెంచీలు లేకపోవడంతో ఎక్కువమంది నిల్చొనే వున్నారు. ఎవరి తొందరలో వాళ్లున్నారు. తను అంతగా అరుస్తున్నా మౌనంగా వున్న భార్యను చూస్తే కోపం యింకా ఎక్కువయింది సుబ్బయ్యకు.

"ముందుగాల మీ తమ్ముడు నారిగోడ్ని మెడ్తోగొడ్తే... నీకు బుద్ధొచ్చాది. యిదంతా వాడు చేసిన పనే".

"వాడేంచేసె. అక్కామామకు సాయం చేద్దామనుకుంటే యిట్లాయ" అంటూ తమ్ముడ్ని వెనకేసుకొచ్చింది ఎర్రమ్మ.

"ఏంబ్బీ ఈడుండావు" అంటూ వచ్చాడు రామయ్య.

"అబ్బ చేసిందానికి కొడుకు దేశాలు పట్టిపాయనంట. పెండ్లాం చేసిందానికి వూర్లు తిరగతాండా".

"ఎర్రమ్మా... ఏమన్నేడుమ్మే ఏజెంటు?"

"యింగా ఆర్నెల్లు పడతాదంటన్నా అంపీడానికి"

"పసల పండక్కు అంపతానంటాన్నె. మళ్లా ఆర్నెల్లన్నేడా? ఏజెంటు మంచోడే. నిదానమయినా మంచితావన్నే పెడతాడులే. మనూరి బస్సు యింగ గంటకొచ్చాదంటబ్బీ. బజారీదికి పోదాంరా పనుండాది" అన్నాడు రామయ్య.

"ఏం పని?"

"మనవరాలు వయసుకొచ్చిందంట. రేబ్బోవాల్ల. కమ్మతట్లు కొందామని రెండేలు లెక్కదెచ్చినా".

"పదా" అంటూ భార్య చెవులవైపు చూశాడు సుబ్బయ్య.

"నువ్వూ రామ్మే" అన్నాడు రామయ్య.

"వంట్లో బాగలేదన్నా.... మీరు బోండి" అంది నిల్చున్నచోటే నేలమీద కూర్చుంటూ...

మగవాల్లిద్దరూ అక్కడినుండి వెళ్లిపోయారు.

ఎర్రమ్మ పొడవూ కాదు పొట్టీకాదు. తలలో అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు. జుట్టుకు నూనె రాసి సవరం పెట్టుకునింది. జడలో వుదయమెప్పుడో పెట్టుకున్న మందారం పూవు వాడిపోయింది. వక్కాకు నమిలి నమిలి పళ్లు గారపట్టాయి. ముదురు ఎరుపురంగు పూలున్న లేత నీలం రంగు చీర కట్టింది. వేసుకున్న నల్లరంగు రవికె మీద చమట మరకలున్నాయి. బొడ్డులో దోపుకున్న వక్కాకు సంచిని బయటకు తీసింది. అందులోనుంచి వక్క తీసి నమిలింది. తమలపాకుకు సున్నం రాసి నోట్లో పెట్టుకుంది. సంచిలోంచి దుగ్గుతీసి నోట్లో వేసుకుని చేతులు దులుపుకుంది. అలవాటయిన పని కాబట్టి ఒకదాని తర్వాత ఒకటి నోట్లో వేసుకుందేగాని ఎంతెంత వేసుకున్నదో గమనించనేలేదు.

చుట్టుపక్కల పల్లెల వాళ్లంతా బస్టాండులో వుండడంతో గోలగోలగా వుంది. వీళ్లకు బడుల నుంచి వచ్చిన పిల్లలు జతకలిశారు. వచ్చిపోయే వాహనాల హారన్‌లు. ఇవేమీ ఎర్రమ్మ పట్టించుకోలేదు. అమె మనసు మనసులో లేదు. రెండు సంవత్సరాల క్రితం సంఘటనలు గుర్తుకు రాసాగాయి.

"నామాట ఇనక్కా... నువ్వుగన నిలబన్నేవంటే తప్పకుండా గెలచ్చావు. గెలిచ్చే మీ బతుకులే మారిపోతాయి" అన్నాడు నారాయణ.

"యిబ్బుదేంరా మా బతకలకు? ఒగ రూపాయి బాకీ వుండామా, ఒగపూట పస్తుండామా? యిద్దరు బిడ్డలకు పెండ్లి జేసినాం. వోళ్లకు యిచ్చిన మాటకాడికి తక్కువ జెయ్యలా. పండగలకు వచ్చాండారు. కోన్ని కొచ్చాండాం. గుడ్డలు పెడతాండాం. యింతకన్నా యింగేం బతుకువాయ్" అన్నాడు సుబ్బయ్య.

"అయితే నాకు పదివేలీ. మళ్లిచ్చా"

"నీ మాదిర్తో మా యింట్లో ఎవురూ కొయ్యేటికి బోలా"

"అందుకే చెప్తాండేది. నాకంటే పెండ్లాం కొయ్యేటికి పొయ్యిండాది. లెక్కంపతాండాది. ఆ లెక్కంతా సెంచికారమిచ్చినా. వడ్డీతో బతికెయ్యొచ్చు. నా మాటినండి. మీగ్గూడా నాకన్నా ఎక్కువ లెక్కొచ్చాది."

"లెక్క ఎట్లొచ్చాదిరా" అడిగింది ఎర్రమ్మ.

"ఎమ్మెల్యే చినరెడ్డి చెప్పినాడుక్కా. నువ్వగన ఎంపిటిసిగా నిలబన్నేవంటే రోడ్ల పనులు యిప్పిచ్చాడంట. ఈరబల్లి కాన్నించి రాయచోటికి రోడ్డు ఎట్లుండాదిక్కా...? అది కీలురోడ్డే గదా. ఏసి ఆర్నెల్లు గాలా. అబ్బుడే అంతా గుంతలు. అంత అద్వాన్నంగా వద్దులే. ఒగరకంగా ఏసినా చాలు. ఒగో రోడ్డు పనిలో ఎట్లలేదన్న నలభై ఏభై వేలు మిగల్తాయి. రోడ్డు పని ఒగిటేనా. ఇంగా కరువు పనులుండాయి. ఇస్కూలు బిల్డింగు కట్టించేది. కుళాయిలు ఏపించేది. ఏదో ఒగ పనుంటాది. ఐదేండ్లల్లో ఎట్లలేదన్నే రెండు మూడు లక్షలు మిగల్తాయి. నా మాటినండి."

"అయ్యన్నీ మనబోటోళ్లకు అచ్చిరావులేరా. పస్తుల్లేకుండా తింటాండాం చాల్లే."

"ఎంచోపు చెప్పినా నీకు మతికే ఎక్కదు మామా. నువ్వు పనికిపోయి ఆర్నెల్లు అవతాండాది. కాయిలా పడి మూలుండిపోతివి. అక్క రెక్కల కష్టంతోనే బతకతాండారు. అక్కగూడ వుడిగిపోతే... ఎనకటికి ఏం జేచ్చారు?" ప్రశ్నించాడు నారాయణ.

సుబ్బయ్య బావమరిది ముఖంలోకి తదేకంగా చూసి "మీ యిష్టం. యాడన్నా సావండి. ఏమన్నా చేసుకోండి. నా కాడుండే ఐదేలు లెక్క. అడగబాకండి" అని అక్కడినుంచి లేచి వెళ్లిపోయాడు.

"అక్కా... చినరెడ్డోళ్ల సొంతూరు లక్కిరెడ్డిపల్లెగదా. యిబ్బుడు కడపలో వుండారు. సొంతిల్లు. ఆ లెక్కంతా యాడిదనుకొన్నేవు? వోళ్ల నాయన పెద్దరెడ్డి ఎమ్మెల్యేగా వున్నెబ్బుడు సంపాయిచ్చిందే. ఆయనొగడే కాదులే... చానామంది చానాచానా సంపాదిచ్చిండారు. నువ్వు గూడా కొట్టం పడగొట్టేసి మిద్దిల్లు కట్టుకోవచ్చు" అంటూ మరింత ఆశ చూపెట్టాడు నారాయణ.

"ఔన్రా... ఓట్లల్లో గెల్సాలంటే వూరికే అయితాదా? అందరికీ సారాయి పోయాల. ఇంటింటికీ లెక్క పంచాల. మనకాడ యాడుందిరా లెక్క" అనుమానం వెలిబుచ్చింది ఎర్రమ్మ.

"నిజంగా నువ్వు ఎర్రిదానివేక్కా. ఓట్లల్లో నిలబడాల్నే గానీ, నువ్వు పైసా కర్సు పెట్టే పనుండదు. అంతా చినరెడ్డి చూసుకుంటాడు."

"నాకు చదువులే పాడులే.."

"అయ్యో తిక్కదానా... గొల్లోల్లకు ఏపకాయంత ఎర్రుంటే మన మాలోల్లకు ఎంద్రకాయంత ఎర్రుండాదిక్కా ఇదేమన్నా గవుర్మెంటు వుజ్జోగమా, చదువుతో పనిలే".

"వోళ్ల యిండ్లల్లో ఆడోళ్లు లేరా? మాలోళ్లే కావాలని ఎందుకంటాండారు?"

"అదా... అదంతా పెద్ద కతలేక్కా... నాగ్గూడా సరిగ్గా తెలీదు. మనసానిపాయి యిలాకాలో మాల మాదిగోళ్లకు యిచ్చిందంట గవుర్మెంటు. ఈడ మాదిగోళ్లు లేరు. అందుకే మన మాలోల్లు నిల్చాల, అది గూడా ఆడోళ్ళే" అన్నాడు తల బరుక్కొంటూ నారాయణ.

"వోళ్లు నిజంగా పనులు యిచ్చార్రా?"

"నా మీదొట్టక్కా... పనులిచ్చామని చినరెడ్డే చెప్పె".

"ఏమో... నేను నిన్నే నమ్మతాండా. నాకు వోళ్లు తెలీదు గదా. నువ్వు యాడ ఏలిముద్ర ఎయ్యమంటే ఆడ ఏచ్చా. లాబంలో చెరిసగం" అంది తమ్ముడి ప్రతిపాదనకు అంగీకరిస్తున్నట్టుగా ఎర్రమ్మ.

"నువ్వు ఒప్పుకొంటావో ఒప్పుకోవో అని జాచ్చి బయంగా వున్నిందికా. చినరెడ్డేమో దినాము చెప్పంపిచ్చాండాడు, నిన్ను తొడకరమ్మని. పొయ్యినాదారం నుంచీ చెప్తాంటే యిబ్బుటికి అర్తమయింది. మామకు యింగా గూడా తెల్లా. ఒగసారిగన ఓట్లల్లో దిగినామంటే అట్లే అట్లే ఎమ్మెల్యే, మంత్రి గూడా అయిపోవచ్చుకా. నా పెండ్లాంగన వూర్లో వున్నింటే నీకాడికి రానిచ్చుందునా... దాన్నే నిలబెట్టిందు. పద్దన్నే మామా నువ్వూ మనూరికి రాండి. ఆట్నించి ఎమ్మెల్యే కాడికి పోదాం" అంటూ లేచాడు నారాయణ.

"వుండు పద్దన్నే పోదువు"

"లేదక్కా... రాయచోటికి పోవాల. రెడ్డికి రేపొచ్చాండామని ఫోను చెయ్యాల" అన్నాడు గుడుశె ముందున్న చెప్పులు వేసుకుంటూ.

తమ్ముడ్ని అనుసరించింది ఎర్రమ్మ. యిద్దరూ కాలిబాటగుండా నడుచుకుంటూ రెండు ఫర్లాంగుల దూరంలోని బండిబాటను చేరుకున్నారు. అక్కడున్న స్కూటర్‌ను స్టార్ట్ చేసి "పద్దన్నే మర్చిపోవద్దకా" అని మరోసారి చెప్పి వెళ్లిపోయాడు నారాయణ.

తమ్ముడు కనుమరుగయ్యేంతవరకు చూసి వెనుదిరిగింది ఎర్రమ్మ. ఎగుడుదిగుడుగా వున్న కాలిబాటలో అడుగడుక్కు రాళ్లున్నాయి. తను ఎంపిటిసి సభ్యురాలిగా గెలవగానే ముందుగా తమ వూరికి తారురోడ్డు వేయించాలి అనుకొంది. యింటి వద్దకొచ్చింది. గుడిశెను చూసింది. పైకప్పు వేసి చాలా ఏళ్లయింది. వర్షం వస్తే వెలుస్తుంటుంది. ముందుగా ఆరంకణాల మిద్దె ఎత్తుకోవాల అనుకొంది. ఆ సాయంకాలం వంట చేస్తున్నా, గొడ్లకు మేత వేస్తున్నా, రాత్రి పడుకున్నా... ఎంతసేపూ ఎన్నికల గురించి, గెల్చిన తర్వాత వచ్చే పనుల గురించిన ఆలోచనలే. రాత్రంతా కలత నిద్ర. తెల్లవారి భర్తను తీసుకుని తమ్ముని దగ్గరకు వెళ్లింది. అందరూ కలిసి ఎమ్మెల్యే యింటికి వెళ్లారు. నారాయణకన్నా నాలుగు రెట్లు ఎక్కువగా మాటలు చెప్పాడు ఎమ్మెల్యే. ఆ మాటలు వింటూనే అప్పుడే లక్షాధికారి అయిపోయినట్టు, రేషన్ బియ్యం వదిలేసి జిలకర మసూరన్నం తింటున్నట్టు, మిద్దె యింట్లో వుంటున్నట్టు కలలు కనసాగింది. ఎర్రమ్మ.

మందీమార్బలంతో ఎమ్మెల్యే పక్కనుంటే, అట్టహాసంగా వెళ్లి నామినేషన్ వేశారు. ఇక ఎన్నికలకు వారం రోజులున్నాయంతే. ఎమ్మెల్యే ఎర్రమ్మను పట్టించుకోవడం లేదు. ఎంపిటిసి సభ్యులుగా తన బంధువులను గెలిపించే ప్రయత్నంలో క్షణం తీరిక లేకుండా వున్నాడతను.

ఒకరోజు తమ్మునితో "ఎట్లరా నారిగా... నన్ను నిలబెట్టేసి గమ్మునయిపోతిరి.. చేతిలోవున్నె నాలుగైదేలు ఐపాయ. రెడ్డేమో పట్టించుకోలా" అంది దిగులుగా ఎర్రమ్మ.

"పాపం, రెడ్డికి ముడ్డి కడుక్కొనే తీరుబాటు గూడా లేదక్కా. లెక్క యాడో ఒగతావన పెరక్కచ్చి కర్చు చెయ్యి... మళ్ల చూసుకొందాం" అన్నేడు.

"ఓడిపోతే బగిసాట్లు... దిగవీదిలో లచ్చిందేవి నిలబడిండాది. సరోల్ల దెగ్గిర ఓడిపోతే బగిసాట్లు గదా. ఎట్ల చెయ్యాలరా... నాకేమో గెల్చాలనే వుండాది. లెక్కలేదు. ఓడిపోతానేమో అని ఎసనంగా వుండాది."

"నాకాడుందిలేకా లెక్క. కొయ్యేటి నుంచి మీ మరదలంపిచ్చింది కదా. ఓట్లకు పద్దెదిరవై వేలవుతాది. లెక్కేసినా. నేనిచ్చాన్లే నాకు మళ్లిద్దురు" భరోసా యిచ్చాడు నారాయణ.

"ఒసేయ్ మూగేరి. రాయ్యే బస్సొచ్చిండాది... ఏం యోచన జేచ్చాండావే" సుబ్బయ్య అరుపులతో ఎర్రమ్మ ఆలోచనలకు అంతరాయం కలిగింది. వీరబల్లి బస్సు వద్దకు వెళుతున్న భర్తను చూసి గబగబా లేచింది. ఒడిలోంచి జారిపడిన వక్కాకు సంచిని తీసుకుని బొడ్డు పక్కన చీరలో దోపుకుంటూ వెళ్లి బస్సెక్కింది. అప్పటికే బస్సు దాదాపు నిండిపోయింది. రామయ్య, సుబ్బయ్య కూర్చుని వున్నారు. ఎర్రమ్మకు కిటికీ పక్కన చోటిచ్చారు. సీట్లో కూర్చుని కిటికీలోంచి బయటకు వుమ్మింది.

"వారానికి కట్టాకులు చాలవుబ్బీ దీనికి" అన్నాడు ఫిర్యాదు చేస్తున్నట్టు సుబ్బయ్య.

"నీకు రోజుకు కట్టబీడీలు చాలవే" అంది తల పైకెత్తి ఎర్రమ్మ.

"నోర్ముయ్యే... ఓట్లల్లో గెల్చినాంక పైసా సంపాదన లేదుగానీ నామింద తిరగబడేది నేర్చుకున్నేవే" అంటూ పళ్లు పటపటా కొరుకుతూ భార్యవైపు వురిమి చూశాడు సుబ్బయ్య.

"పేనుకు పెత్తనం, ఆడదానికి రాజ్జెం ఈగూడదంట. అయిపోయిందానికి ఒగిసేదేల? ఆ బుద్ధి ముందుండాల. ఎవుర్ని యాడ బెట్టాల్నో ఆడబెట్టాల... యిందోమ్మే, కమ్మతట్లు చూడు" అంటూ ఎర్రమ్మ చేతికి మడత బెట్టిన కాగితం యిచ్చాడు రామయ్య.

కాగితం విడదీసి కమ్మలు చేతిలోకి తీసుకుని చూసింది.

"ఎట్లుండాయిమే..."

"బాగుండాయినా..." అంది కాగితం మడతబెట్టి అతని చేతికిస్తూ.

"పజ్జెనిమిది నూర్లు..." అంటూ కమ్మలు తీసుకుని నిక్కరు జేబులో వేసుకుని "వుక్కగా వుండాది. కొంచేపు కిందికి పాబ్బీ" అని చెప్పి లేచాడు రామయ్య

భుజంమీదున్న తుండుగుడ్డను సీట్లో వేసి అతడ్ని అనుసరించాడు సుబ్బయ్య.

రామయ్య కొన్న కమ్మలు చూడగానే ఎర్రమ్మ మనసు బాధతో బరువెక్కింది. కూతుండ్లు గుర్తొచ్చారు. యింతకుముందు తనకున్న రాళ్ల కమ్మలు కళ్లముందు మెదిలాయి. ఆమె ఆలోచనలు ఆరు నెలల వెనక్కు పరుగులు తీశాయి.

అది కడప నుంచి కర్నూలుకు వెళ్లే జాతీయ రహదారి. ఆ రహదారి పక్కన కడప శివార్లలో వుందొక బంగళా. బంగళాకున్న మనిషెత్తు ఇనుప గేటు వేసివుంది. గేటు లోపల రెండు ఆల్సేషియన్ కుక్కలను కట్టేశారు. అవి వుండుండి ఒక్కోసారి తలుపు ముందు కూర్చుని వున్న నారాయణ, ఎర్రమ్మల వైపు చూసి గుర్రుమంటున్నాయి. అవి గుర్రుమన్నప్పుడంతా వులికిపడుతోంది ఎర్రమ్మ. వాళ్లొచ్చి రెండు గంటలవుతోంది. ఎమ్మెల్యే పడుకోనున్నాడు కొంతసేపు కూర్చోమని చెప్పింది పనిమిషి. నోరు తెరచి మాట్లాడుకుందామన్నా భయం. అంతదూరం నుంచి బస్సుల్లో రావడంతో ఎర్రమ్మకు బాగా దాహంగా వుంది. నీళ్లు అడుగుదామంటే బయట ఎవరూ లేరు. ఓట్లకు ముందు నిత్యం కష్టపడుతూ, కడుపునిండుకు తింటూ గుండ్రాయిలా వుండేది ఎర్రమ్మ. అప్పటికి నలభై ఐదు సంవత్సరాలామెకు. ఈ ఒకటిన్నర సంవత్సర కాలంలోనే పది సంవత్సరాల వయసు పైబడ్డట్లుంది. ఎమ్మెల్యే వస్తున్న అలికిడి కావడంతో గబగబా లేచి నిల్చున్నారు.

"ఏం నారాయణా... ఎంచేపాయ వచ్చి" అంటూ వరండాలో వేలాడుతున్న వుయ్యాలలో కూర్చున్నాడు ఎమ్మెల్యే.

"అబ్బుడే రొంచేపాయన్నా" నసుగుతూ అన్నాడు నారాయణ.

"ఏం ఎర్రమ్మా.. బాగుండారా?"

"ఏం బాగులేన్నా... మా బాగులు"

"నేకేంమ్మా.... ఎంపిటిసివి. మీవోళ్లలో ఎవురే గానీ సర్పంచ్ ఎలచ్చన్లలో కనీసం మెంబర్‌గా అన్నా గెల్చినారా? నువ్వు తొలీగా ఎంపిటిసి గానే గెల్చినావు. నీకేంమ్మా ఎసనం... ఈతూరి ఎమ్మెల్యే అవుతావులే" అంటూ నవ్వాడు చినరెడ్డి.

"తిండి గింజలకు లేక డిమికీలు కొడతాంటే ఎమ్మెల్యే అవతానా... ముందుగాల మాకు బతుకుతెరువు చూపిచ్చన్నా"

"ఇప్పుడు ఎవురికుండాదమ్మా బతుకు తెరువు?" అని కింగ్‌సైజ్ సిగరెట్ వెలిగించి రెండు దమ్ములు లాగి "కరువు గదా.. వానలులే... పంటల్లే... పనుల్లే. కె.సి. కాలవకు నీళ్లు రాలా. యాడ జూసినా కరువే గదా. మేం గూడా యిబ్బందులు పడతాండాం" అన్నాడు వుయ్యాలలో వూగుతూ.

యింట్లోనుంచి పలావు వాసనలు వుస్తున్నాయి. ఎర్రమ్మకు అంతకంతకు దాహం

పెరుగుతోంది. ఉదయం ఎప్పుడో తిన్న అన్నం. ఆకలి కూడా విపరీతంగా వుంది. ఎమ్మెల్యే మాటలు వింటానే ఏం మాట్లాడాలో తోచలేదు ఎర్రమ్మకు.

"ఏం నారాయణా... జల్సానా. కొయ్యేటి డబ్బంతా ఏంచేస్తాండావు?"

"యిల్లు కట్టుకున్నేం. అయిపోయిందిన్నా" అన్నాడు మెల్లగా.

నియోజకవర్గ స్థాయి నుంచి కేంద్రస్థాయి వరకు మారుతున్న రాజకీయాల గురించి మాట్లాడుతూనే వున్నాడు ఎమ్మెల్యే.

ఎర్రమ్మకు నిల్చుకునే ఓపిక లేదు. ఆకలి. దాహం. నీరసం. కూర్చుందామంటే తన తమ్ముడే నిల్చుని వున్నాడు. వచ్చిన విషయాన్ని మాట్లాడిపోవాలి. లేకపోతే మధ్యాహ్నం బస్సు తప్పోతాది. అదిపోయిందంటే తిరిగి రాత్రికే అనుకొంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ కాసేపు ఆగగానే "అన్నా... లెక్కతో బాగా యిబ్బందిగా వుండాది. మా ఆయనకు వొయిస యిపోయిండాది. నేను కూలికి పోదామన్నే పనుల్లేవు. వున్నే ఎంపిటిసిని కదా. అందరాడోళ్ల మాదిర్తో కూలికి పోవాలంటే చిన్నతనంగా వుంటాది" అంది.

"నిజమే గదా, ఎంపిటిసిగా వుండి కూలిపనులు చేస్తారా?"

"మాకేమన్నా బూములూ పాడాన్నా... కూలికి పోకపోతే బతికేదెట్లా. ఓట్లబ్బుడేమో, ఏమేమో పనులు యిప్పిచ్చానంటిరి. రెండేండ్లయితాండాది ఒగపనీ యిప్పిలేదన్నా" అంది హీనస్వరంతో.

"యింటాండావా నారాయణా మీ అక్క మాటలు. కరువుతో అందురూ అల్లాడుతుంటే పనులేదుండాయి. నీకు తెల్దా. యిప్పుడయితే ఏం పనులూ లేవు. ఏదన్నా పని వస్తే నేనే పిల్లంపుతాలే".

"ఇబ్బటికి ఐదు దపాలు వచ్చినాం నా. అందూరం నుంచి ఇద్దరం మనసలం వచ్చిపోవల్లంటే ఇన్నూర్రూపాయలు లెక్కగావాల. ఓట్లబ్బుడు అయ్యిండే కర్చు వడ్డీ మొదులు ముప్పై ఏల దాంకా వుండాదినా. మండలానికి మూన్నెల్లకోసారి పిల్లంపతారు. యాబైతావల ఏలిముద్దర ఏపిచ్చుకుంటారు. యాభై రూపాయలిచ్చారు. అంతకు మించి ఒగ రూపాయి ఆదీకం లేదనా" అంది బాధగా. ఆ మాటలంటున్నప్పుడు దుఃఖపు జీర ఆమె మాటల్లో ధ్వనించింది.

ఎమ్మెల్యే చేతి వాచి వైపు చూశాడు. "ఈసారి తప్పకుండా పని యిప్పిస్తాలేమ్మా. యిప్పుడయితే ఏమీ లేవు. యింగ నువ్వు రావద్దులే. పని వస్తానే నేనే పిల్లంపతా. అప్పుడప్పుడూ నువ్వు కనిపిస్తాండు నారాయణా" అన్నాడు.

సరేనన్నట్టు తల వూపాడు నారాయణ.

"సద్ది తాగిపోండి" అన్నాడు ఎమ్మెల్యే.

"ఆకలిగాలేదు. వచ్చామన్నా" అని నమస్కారం పెట్టి యిద్దరూ అక్కడినుంచి బయటపడ్డారు.

"మనకు పని యిచ్చాడారా నారిగా" అంది దారిలో ఎఱ్రమ్మ తమ్మునితో.

"....."

"మీ మామ దెగ్గిర దినమ్మూ తిట్లు తింటాండారా. వున్నిలెక్కాపాయ. అప్పులూ ఆయ అంటాండాడు. ఎన్ని రోడ్డు పనులు మనతిక్కు జేచ్చాండేది? చినరెడ్డి యియ్యాలనుకోనుంటే ఎప్పుడో పని యిప్పిచ్చుండురా. పోనీ, ఎబ్బుడన్నా నీకన్నా సాయం జేసినాడా?"

"....."

"వోళ్లు మనకెందుకు సాయం జేచ్చాఱ్రా. వోళ్ల మనిసి గెల్చాల అని నన్ను నిలబెట్టినారంతే. మనకు సాయం జేయాలని కాదు. ఓట్లబ్బుడు నువ్వేమో లెక్కయిచ్చివి. నీ పెండ్లాం కొయ్యేటి నుంచి వచ్చానే లెక్కగావాలనె. యిచ్చావా సచ్చావా అనె, యాడేన్నో తెచ్చి బాకీ కట్టినాం. సొంతం... తమ్ముని పెండ్లామే గమ్మునుండలా. వోళ్లు గమ్మునుంటారా లెక్క ఈకపోతే. మాట బొయ్యాలకు నువ్వు వచ్చేదే మానుకొంటివి. మా బతుకు ఎంత హీనమయిందో తెల్లా నీకు. పిల్లోల్లు ఉగాదికి వచ్చింటే కమ్మతట్లు కొదవబెట్టి గుడ్డలు బెట్టినాం. ఈ యరవదాకా యిడిపీలా. లెక్కేడుందిరా యిడిపీకి? ఆ కమ్మతట్లు పెద్దమ్మి కడుపులో వున్నెబ్బుడు చేపిచ్చినాడు మీ మామ. కొదవబెట్టమని యిచ్చాలకు మీ మామ గూడా యేడ్చినాడు" అని తమ్మునితో మాట్లాడుతుండగానే ఎఱ్రమ్మ కళ్లనుంచి నీళ్లు కారుతున్నాయి.

బస్సు స్టార్ట్ కావడంతో వులికి పడింది ఎఱ్రమ్మ. యిప్పుడు తన కళ్లనుంచి కారుతున్న నీళ్లను తుడుచుకుంది. తన ఏడుపును ఎవరైనా చూశారేమోనని చుట్టూ చూసింది. బస్సు బయలుదేరుతుండడంతో కింద వున్నవాళ్లంతా ఒకర్నొకరు తోసుకుంటూ లోపలకు వస్తున్నారు.

"సీట్లో కూచ్చోనుండచ్చు కదా, కిందికి పోకుండా. ముసిలోల్లు గూడా కిందికి దిగి ఎక్కతాండారే" అన్నాడు కండక్టరు రామయ్య, సుబ్బయ్యలను ఉద్దేశించి.

"ఏంబ్బీ... మేం మన్చులం గాదా?" అన్నాడు రామయ్య నవ్వుతూ.

"టికెట్... టికెట్" అంటూ కండక్టర్ వెనక్కు వెళ్లాడు.

బస్సు రాయచోటి దాటి వీరబల్లి వైపు వేగంగా వెళ్లసాగింది. కిటికీలోంచి వస్తున్న చల్లగాలికి కళ్లు మూసుకుంది ఎఱ్రమ్మ. కళ్లు మూసుకుందే కానీ ఆమె మనసులో గత సంఘటనలు మెదలుతున్నాయి. బస్సు ముందుకు వెళుతున్నా ఆమె ఆలోచనలు మాత్రం వెనక్కు వెళ్లాయి.

"నా మాటినే. ఒగసారి కొయ్యేటికి బోయొచ్చేచాలు. అప్పులన్నీ తీరిపోతాయి."

"ఈ ముసిల్దాన్ని తీసుకుంటారా?"

"నీకెందుకమ్మా?... అదంతా నేను చూసుకుంటా. మామూలుగా అయితే నలభై వేలవుతాది. నీ యాట్లావోళ్లకు యింగా ఐదువేలు జాచ్చి అవతాది" అన్నాడు ఏజెంటు.

"దేశంగాని దేశం...." అంది ఎర్రమ్మ.

"నీయమ్మ.... ఈ దేశంలో వుండి ఏం సంపాదించినామే. మనకోసరమే ఏజెంటు అరుసార్లు వచ్చె. ఎన్నిసార్లు జెప్పినా నువ్వు అదే పల్లాయి పాడతాండావే. నాగ్గన ఒంట్లో బాగున్నింటే నేనే పోయిందు. బాకీల్లేకుండా వున్నింటే ఏ చెట్టుకో వురేసుకొని సచ్చిందు. యిబ్బుడు సచ్చే అందురూ తిట్టుకుంటారు. ఒగరికి రుడం లేకుండా పోవాల. ఒగసారి పొయ్యేసి రాయ్యే" అన్నాడు ఆవేశంగాను, బాధగాను సుబ్బయ్య.

భర్త బాధను అర్థం చేసుకుందేమో, సరేనన్నట్లు తల వూపింది ఎర్రమ్మ.

పాస్‌పోర్టుకు రెండు వేలవుతుందన్నాడు ఏజెంటు. రెండు నెలల్లో వస్తుందన్నాడు. తర్వాత నెలకంతా వీసా వస్తుందని చెప్పాడు.

"మనం యిబ్బుడే బాకీలుండాం. బూములా బుఱ్ఱలా. యాభైవేలు ఎవరిచ్చారు?" అనుమానం వెలిబుచ్చింది ఎర్రమ్మ.

"యాపారానిగ్గానీ సేద్దానిగ్గానీ, యింగ దేనికన్నా గానీ.... అప్పు పుట్టదేమో, కొయ్యేటికి పోతాండారంటే ఎంత కావాలన్నే దొరకతాది. ఐదు రూపాయల వడ్డీ వచ్చాది. లెక్క కరెక్టుగా వచ్చాది. ఎందుకీరు అప్పు?" అన్నాడు ఏజెంటు.

ఏజెంటు చెప్పినట్టే రెండు నెలలకు పాస్‌పోర్టు వచ్చింది. మరో నెలకు వీసా అన్నాడు. నెల తర్వాత వెళితే ఆరు నెలలన్నాడు. యింటికి వస్తున్న అప్పుల వాళ్లు కళ్ల ముందు మెదిలారు ఎర్రమ్మకు.

బస్సు పెద్ద కుదుపుతో ఆగింది.

"లెయ్‌మే... దిగదాం" అంటూ లేచారు సుబ్బయ్య, రామయ్య.

వాళ్లతోపాటు ఎర్రమ్మ బస్సు దిగింది. మూడు కిలోమీటర్ల దూరంలో వున్న తమ పల్లెకు నడచుకుంటూ వెళుతున్నారు. దారి పొడవునా మగవాళ్లిద్దరూ మాట్లాడుతూనే వున్నారు. ఎర్రమ్మ ఒక్క మాటా మాట్లాడలా.

తమ వూరికి పోతున్న దారి ఎర్రమ్మకు మెడకు చుట్టుకుంటున్న పాములా వుంది. తాను ఎన్ని కలలు కంది. ఆ దారిని బాగు చేయించాలని, గుడిసె స్థానంలో ఆరంకణాల మిద్దె కట్టుకోవాలని... ఒక్కటీ నెరవేరలేదు. తను యింటికి పోతే... కొయ్యేటికి పోయి వస్తే మళ్లా ఓట్లు వస్తాయి... తమ్ముడు రావచ్చు. లేకుంటే ఎమ్మెల్యే రావచ్చు... ఎన్నికల్లో నిలబడమని ఈ సారి ఏవేవో ఇంకా పెద్ద ఆశలు చూపచ్చు... తను వాటికి లొంగిపోవచ్చు. అలా తలచుకోగానే ఎర్రమ్మలో దుఃఖం, కోపం పెల్లుబికాయి. అక్కడే ఏడుస్తూ కూలబడిపోయింది.

"ఏమయిందిమ్మే...." అన్నారిద్దరూ.

"నన్ను ఎర్రిముండను జేసి ఆడుకొంటాండారు ఈళ్లంతా...." అంటూ రోదించసాగింది.

"ఏందిమే దోవలో ఏడుచ్చా.... రా" అంటూ భార్య చేయి పట్టి లాగాడు సుబ్బయ్య.

భర్త చేతిని విదిలించి కొట్టింది.

"వోళ్ల నోళ్లల్లో మన్ను బడా...

ఆ నా బట్టల చేతులిగా...

వోళ్లకు లక్కవా గొట్టా నాశనమైతారు.

మా వుసురు గొట్టినోళ్లు బాగుపడరు...

నిలవనా నిగిడి సచ్చారు...." అంటూ నేల మింది దుమ్మును రెండు చేతుల్లోకి తీసుకుని గాలిలోకి విసరసాగింది.

"గాలి... గాలి సోకిందిబ్బీ నీ పెండ్లానికి" అన్నాడు రామయ్య.

ఆ మాటలతో భార్యవైపు బిత్తరచూపులు చూశాడు. సుబ్బయ్య!

నవ్య వీక్లీ, *15-9-2004*